క్లుప్తంగా

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్: మేడిపెల్లి మండలంలో ఎస్సారెస్పీ వరదకాలువ ఏరియాలో భూములున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చిరంజీవి సూచించారు. ఆదివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మాట్లాడారు. ఇటీవల వరద కాలువ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్, విద్యుత్ మోటార్ల చోరీ జరుగుతున్నాయని, కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రైతులు రోజూ సాయంత్రం, రాత్రివేళల్లో వరదకాలువ ఏరియాలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న దాతలు

రాయికల్: పట్టణానికి చెందిన కలమడుగు రాజం మృతిచెందగా మైతాపూర్ గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం నిత్యావసర వస్తువులను అందజేశారు. శ్రీనివాస్ కుమారుడు మాద్విక్ పుట్టిన రోజు సందర్భంగా 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో కడకుంట్ల జగదీశ్వర్, సాయికుమార్, సయ్యద్ రసూల్, కలమడుగు రమేశ్, తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన గుగ్గిల్ల విజయలక్ష్మికి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యఖర్చుల కోసం రూ.2.50 లక్షలు ఎల్‌వోసీని బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం అందజేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా ఎల్‌వోసీ మంజూరైనట్లు తెలిపారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషిచేసిన మంత్రి హరీశ్‌రావుకు, బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మీనరసింహారావుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం


గోవర్ధన్

కథలాపూర్: మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కథలాపూర్‌కు చెందిన సిరి మిక్సింగ్ సెంటర్ యజమాని అంది గోవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కాసారపు నరేశ్, కోశాధికారిగా కట్టికోల సతీశ్ ఎన్నికయ్యారు. మండల నాయకులు రామ్మోహన్, విశ్వనాథం, ప్రసాద్, లతీశ్, సురేశ్ పాల్గొన్నారు.

'డిమాండ్లు పరిష్కరించాలి'

మల్యాల: పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనిగరపు తిరుపతి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో తమ వంతు సేవలందించిన ప్రభుత్వం కార్మికుల సేవలను గుర్తించడం లేదన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని, డెంగ్యూ, మలేరియాతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల సేవలను గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, పీఆర్సీ అమలు చేయాలన్నారు.

'ఇన్‌స్పైర్' అయ్యేలా..

- 'ఇన్‌స్పైర్ మనక్' అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం
- కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలకు అవకాశం
- ఒక పాఠశాల నుంచి ఐదుగురికి మాత్రమే అవకాశం
- ఆగస్టు 31 వరకు గడువు


విద్యార్థుల ఎగ్జిబిట్ల ప్రదర్శనలను తిలకిస్తున్న అధికారులు (ఫైల్)


విజ్ఞాన మేళా (ఇన్‌స్పైర్)లో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు (ఫైల్)

మల్లాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి బాల శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2009 నుంచి ఇన్‌స్పైర్ మనక్ పేరిట విజ్ఞాన మేళాను నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. ఇలా జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తారు. ఇన్‌స్పైర్ మనక్ 2023–24 సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల నుంచి నూతన ఆవిష్కరణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాల్లో అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆగస్టు 31 వరకు గడువు విధించారు.

ఆరునుంచి పదో తరగతి విద్యార్థులకు అవకాశం

విజ్ఞాన మేళాలో పాల్గొనేందుకు జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రైవేట్, కస్తూర్బా, గురుకుల, ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసించే ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు అవకాశం ఉంది. ఒక పాఠశాల నుంచి కేవలం ఐదుగురికి మాత్రమే మేళాలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. విద్యార్థి పూర్తి వివరాలతో పాటు ప్రదర్శించే ఎగ్జిబిట్‌కు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. ఇలా పొందుపర్చిన వివరాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ప్రజాప్రతినిధులు పరిశీలించిన అనంతరం వాటిని ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయికి ఎంపికైన వారికి రూ.10వేలు, రాష్ట్రస్థాయికి ఎంపికైతే రూ.40వేలు, జాతీయస్థాయికి ఎంపికైన వారికి రూ.60వేల నగదును నేరుగా విద్యార్థి అకౌంట్‌లో జమచేస్తారు. జాతీయస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డును అందజేస్తారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 475 మంది విద్యార్థులు తమ పేర్లను, ప్రాజెక్టులను నమోదు చేసుకోగా, జిల్లాలో 60 మంది విద్యార్థులు జిల్లాస్థాయిలో ఎంపికయ్యారు. వీరిలో ఐదుగురు రాష్ట్రస్థాయిలో పాల్గొనగా, వీరికి ఒక్కొక్కరికి రూ.10వేలు వారి ఖాతాల్లో జమయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	509
ప్రాథమికోన్నత పాఠశాలలు	85
జెడ్పీ ఉన్నత పాఠశాలలు	185
మొత్తం విద్యార్థులు	55,266
మోడల్ స్కూళ్లు	13
కస్తూర్బాగాంధీ విద్యాలయాలు	14
విద్యార్థులు	11,311
మొత్తం విద్యార్థులు	66,577
ప్రైవేట్ పాఠశాలలు	376
విద్యార్థులు	93,213

దరఖాస్తు చేసుకునే విధానం

- ఇన్‌స్పైర్ మనక్ అవార్డులో పాల్గొనేందుకు ముందుగా వెబ్‌సైట్‌లో పాఠశాల అథారిటీ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.
- వెబ్‌సైట్‌లో న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.
- విద్యార్థి పాఠశాలకు సంబంధించిన వివరాలను పొందుపర్చిన అనంతరం సేవ్ చేయాలి.
- విద్యార్థుల దరఖాస్తు సంబంధిత జిల్లా అథారిటీకి చేరుతుంది.
- దరఖాస్తు ఆమోదించిన తర్వాత మనం ఇచ్చిన ఈ–మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది.
- మనకు వచ్చిన లింక్‌తో వచ్చిన ఐడీతో పాస్‌వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి.
- అనంతరం విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

సారంగాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో గేదెకు వినతిపత్రం అందజేశారు. సమ్మెపై ప్రభుత్వం చర్చల పేరుతో వాయిదా వేయడం సరికాదని, తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. బీర్‌పూర్ మండలపరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నిరసన తెలిపారు.

సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ఉత్సవాల్లో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ

కథలాపూర్: మండలంలోని కలిగోట గ్రామంలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గిరిజనులు ఆడుతూ పాడుతూ ఆనందోత్సవాల మధ్య ఉత్సవాల్లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం మహరాజ్ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. ఈ ఉత్సవాల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సర్పంచ్ ధరావత్ సరోజ, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం

కొండగట్టు : మండలంలోని చెప్యాలలో పద్మశాలీ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా గోనె మధుసూదన్ ఉపాధ్యక్షుడిగా అడిగొప్పుల శ్రీధర్ ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ తిరుపతి కోశాధికారిగా అడిగొప్పుల తులసీరాం, గౌరవాధ్యక్షుడిగా వడ్లకొండ బుచ్చిరాములును మండల అధ్యక్షుడు మార్గం చిరంజీవి సమక్షంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు చెన్న దేవేందర్ గాజుల లక్ష్మణ్, మార్గం చిరంజీవి, గాలిపెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లింగార్చన


లింగార్చనలో పాల్గొన్న భక్తులు

రాయికల్ : పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 108 మంది దంపతులతో కోటి లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు గంప ఆనందం, కార్యదర్శి గంగాధర్, కోశాధికారి చింతఅశోక్, వాసవీ ఆలయ కమిటీ చైర్మన్ ఎనుగందుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు శివ కుమార్, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి జనార్దర్, దాతలు రమేశ్, రాజు, నారాయణ, కిషన్, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కథలాపూర్: మండలకేంద్రంలో కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ (సీఎస్‌ఆర్) సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు సమాచార హక్కు చట్టంపై ఆదివారం అవగాహన కల్పించారు. సంస్థ మండల ఇన్‌చార్జి చార్జీ తాలుకా మల్లేశ్ మాట్లాడుతూ...ప్రభుత్వాలు ఖర్చుచేసే నిధులను తెలుసుకోవడం ప్రజలు బాధ్యతగా భావించాలన్నారు. అవినీతిని, అక్రమాలను సమాచార హక్కు చట్టం ద్వారా వెలికి తీయవచ్చన్నారు. ప్రతినిధులు ప్రసాద్, సంతోష్, రవి, పాల్గొన్నారు.

అన్నదానం

వెల్గటూర్: మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన వెల్గటూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సిరిపురం తిరుపతి తన కూతురు వైష్ణవి జన్మదినం సందర్భంగా పంచాయతీ కార్మికులకు అన్నదానం చేశారు. తన కూతురు జన్మదినం సందర్భంగా అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోర్ టీం మెంబర్ లయన్ సామ ఎల్లారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు సత్తయ్య, రాయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కథలాపూర్: మండలంలోని కొండాపూర్‌కు చెందిన పృథ్వీరాజ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా జిల్లా సహాయక బృందం సభ్యులు రూ. 5వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ సంస్థ అడ్మిన్ పంచతి నరేశ్, మారుతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, మహర్షి, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశానికి వారు అందించిన సేవలను కొనియాడారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు గాంధారి శ్రీ నివాస్, సత్యనారాయణ, నీలి శ్రీనివాస్, బద్రి భూమేశ్, సురేశ్, చరణ్, శ్రీరాం, సాయికృష్ణ, నిత్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

వెల్గటూర్(ధర్మపురి): పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పైడిపెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జక్కుల రాజయ్య (50) వ్యవసాయ మోటార్ బంద్ చేయడానికి ఆదివారం రాత్రి సుమారు 8.40గంటల సమయంలో పొలానికి వెళ్లాడు. ఈక్రమంలో గట్టుపై పాముకాటుకు గురైచనిపోయాడు. మృతుడి కుమారుడు జక్కుల రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

కోతుల మూకకు కళ్లెం వేసేదెప్పుడో ?


కస్తూర్బా బాలికల విద్యాలయంలో గంపులుగా కోతులు

- మండలంలో రోజురోజుకూ పెరుగుతున్న వానరాల బెడద
- కట్టడి చేయడంలో అధికారుల చర్యలు శూన్యం
- వారం రోజుల్లో కోతుల దాడిలో పదిమందికి పైగా గాయాలు

సారంగాపూర్: మండలంలో రోజురోజుకూ కోతుల బెడద పెరుగుతోంది. మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం, పక్కనే ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలోకి ప్రవేశించి హైరానా సృష్టిస్తున్నాయి. కొన్నిసార్లు ఇళ్లలోకి వెళ్లి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. కోతులను గ్రామాల్లోకి రాకుండా కట్టడి చేయడంలో అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అటవీ ప్రాంతం కావడంతో

సారంగాపూర్ మండలం అటవీప్రాంతం, ప్రతి గ్రామం అడవిని ఆనుకుని ఉండటం, కోతులు అధికంగా ఉన్న ప్రాంతం నుంచి గుంపులకొద్దీ వ్యాన్లలో తీసుకువచ్చి అటవీప్రాంతాల్లో వదిలివెళ్తున్నారు. అడవుల్లో ఆహారం దొరక్క కోతులు గ్రామాల్లోకి చేరి ఇళ్లపై, చెట్లపై ఉంటూ పలువురిపై దాడిచేస్తున్నాయి. పదిరోజుల్లో పదిమందికిపైగా కోతుల బారినపడి గాయపడ్డారు. వృద్ధులను కరిస్తే మాత్రం కదల్లేని స్థితిలో ఉండగా భయం భయంగా గడుపుతున్నారు.

మొక్కజొన్న సాగుకు దూరం..

మొక్కజొన్న పంట వేస్తే కంకుల కోసం వస్తాయి. మినుము, పెసర, కంది, అలసంద వంటి పంటలు వేసిన సమయంలో తక్కువగా పంట ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. మండలంలో వర్షాకాలంలో మొక్కజొన్న పంట సాగు చేయాలనుకున్న రైతులు కోతుల బెడదతో మొక్కజొన్న సాగుకు దూరంగా ఉన్నారు. పాత ఇళ్లకు ఉన్న గూన పెంకలు పగులగొడుతున్నాయి.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం అటవీప్రాంతాన్ని ఆనుకొని ఉండగా, ఎస్సీ బాలుర వసతి గృహం అటవీప్రాంతానికి కొద్ది దూరంలో ఉంది. ఉదయం అల్పాహారం చేసే సమయంలో, మధ్యాహ్న భోజన సమయంలో కోతుల బెడదతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కస్తూర్బా పాఠశాల విద్యార్థినిని కోతులు వెంబడించగా కిందపడి తీవ్రంగా గాయపడింది.

ఫలితమివ్వని మంకీ ఫుడ్ కోర్టులు

సారంగాపూర్, అర్పపల్లి, రేచపల్లి అటవీప్రాంతాల్లో అటవీశాఖకు భూముల్లో అటవీశాఖ, ఉపాధిహామీ శాఖ నాలుగు సంవత్సరాల కింద మంకీఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసింది. ఒక్క ఫుడ్‌కోర్టులో ఐదెకరాల విస్తీర్ణంలో 2500 వివిధ పండ్ల మొక్కలు నాటారు. కోతులు వాపస్ వెళ వెళ్లాలన్న నినాదం ఏ మాత్రం పనిచేయలేదు. వీటి నిర్వహణ గ్రామ పంచాయతీలకు భారంగా మారడంతో మంకీ ఫుడ్ కోర్టుల్లోకి కోతులు వెళ్లలేదు.

బోనులో తరలింపు..

పోతారం సర్పంచ్ ఢిల్లీ రామారావు గ్రామంలో కోతుల సంఖ్య పెరగడంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు జాలీలతో, రూ.10వేలు వెచ్చించి బోను తయారు చేయించాడు. అందులో కోతులకు ఇష్టమైన ఆహారం ఉంచడంతో కోతులు వచ్చి చేరిన వెంటనే వాటిని పట్టుకెళ్లి అటవీప్రాంతంలో వదలిపెడుతున్నారు. ఇప్పటి వరకు 150 కోతుల వరకు తరలించారు.

పంచాయతీల పరిధిలోకే



కోతుల బెడదను తప్పించడం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉంటుంది. అటవీప్రాంతాల్లోను వందల సంఖ్యలో కోతులు స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. మేం అడవుల్లోకి వెళితే గుంపులు గుంపులుగా వచ్చి వెంట పడుతున్నాయి.

– మహేశ్, అటవీశాఖ సెక్షన్ అధికారి

మంకీ ఫుడ్ కోర్టులతో ప్రయోజనం



మంకీ ఫుడ్ కోర్టుల్లోని పండ్ల మొక్కలు మరో ఏడాదిలో కాసే అవకాశం ఉంది. దీంతో కోతులు గ్రామాలకు రాకుండా కొంత కట్టడి చేయొచ్చు. కోతులను ఇక్కడ పట్టిస్తే మరో గ్రామ అటవీప్రాంతంలో వదిలేస్తున్నారు. అక్కడివారు మళ్లీ ఇక్కడ వదులుతున్నారు.

– శశి కుమార్‌రెడ్డి, ఎంపీవో, సారంగాపూర్

రోడ్ల వెంటే చెత్త..


రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తకుప్పలు

జగిత్యాలటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లోని రోడ్లు చెత్త డంపులుగా మారుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల బల్దియా పరిధిలోని 9,10వ వార్డుల్లోని లింగంపేట, అంతర్గాం రోడ్లు మినీ డంపింగ్ యార్డులుగా మారి దుర్గంధం వెదజల్లుతుండటంతో ఆ రోడ్ల వెంట ప్రయాణించే వారు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్దియా పారిశుధ్య సిబ్బంది దృష్టిసారించి రోడ్ల వెంట చెత్త వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థిక చేయూత



రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన ఎర్దండి వెకంటి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి రాయికల్‌లోని లయన్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం రూ.6వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆదిరెడ్డి, ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, కార్యదర్శి మోసరపు శ్రీకాంత్, సభ్యులు శ్రీనివాస్ గ్రామ నాయకులు రొట్టె శ్రీధర్, తిరుపతి, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు


పాఠశాలలో స్ప్రే చేయిస్తున్న వైద్యసిబ్బంది

రాయికల్: మండలంలోని పలు పాఠశాలల్లో ఆదివారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఏసీఎం–ఐఆర్‌ఎస్ (ఆల్ఫా సైపర మైత్రీన్, ఇండూర్ రెసిడ్యూల్ స్ప్రే) నిర్వహించారు. మండలంలోని అల్లీపూర్ ఎంజేబీటీపీ బీసీ వెల్ఫేర్ పాఠశాల, ఉప్పుమడుగు కేజీబీవీ, ఇటిక్యాల మోడల్ స్కూల్, ఒడ్డె లింగాపూర్ మినీ గురుకుల పాఠశాల, జగన్నాథ్‌పూర్ ఆశ్రమ పాఠశాల, మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ వసతిగృహాల్లో వీటిని స్ప్రే చేశారు. కార్యక్రమంలో మండల విస్తీర్ణాధికారి శ్రీనివాస్, జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.